నీట్‌లో స్టేట్ టాపర్‌గా జీవన్‌సాయి

వైద్య విద్య ప్రవేశ పరీక్ష(యూజీ) ఫలితాలు విడుదల • రాష్ట్రం నుంచి పరీక్షకు 70వేల మంది హాజరు • 41వేల మంది క్వాలిఫై

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ (యూజీ) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. రాష్ట్రానికి చెందిన కాకర్ల జీవన్ సాయికుమార్ ఆలిండియా ఓపెన్ కోటా 18వ ర్యాంకు, షణ్ముఖ నిశాంత్ అక్షింతల 37వ ర్యాంకు, మంగారి వరుణ్ 46వ ర్యాంకు, వై షణ్ముఖ్ 48వ ర్యాంకు, బిదిశ మాజీ 95వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. టాప్-100 ర్యాంకుల్లో తెలంగాణకు చెందిన వారు ఐదుగురు మాత్రమే ఉన్నారు. కాకర్ల జీవన్ సాయికుమార్ ఆలిండియా 18వ ర్యాంకుతో పాటు తెలంగాణ టాపర్‌గాను నిలిచాడు. ఈ సారి తెలంగాణ నుంచి 72వేలకు పైగా విద్యార్థులు నీట్ (యూజీ) పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 70వేల మంది హాజరయ్యారు. 41వేలకు పైగా విద్యార్థులు క్వాలిఫై అయ్యారు.

రిజర్వేషన్లలోనూ వెనుకబాటే

నీట్ ఫలితాల్లో ఈసారి తెలంగాణ విద్యార్థులు వెనుకబడ్డారు. ఏటా ఆలిండియా టాప్ ర్యాంకుల్లో తెలంగాణ విద్యార్థులుండేవారు. కానీ ఈ ఏడాది టాప్-10లో ఒక్కరు కూడా లేరు. టాప్-20లో ఒకే ఒక్క విద్యార్థి చోటు దక్కించుకున్నారు. క్యాటగిరి ర్యాంకుల్లోనూ తెలంగాణ విద్యార్థులు వెనుకబడ్డారు. మహిళా టాపర్లల్లో బిదిశ మాజీ 13, రేండ్ల బ్రాహ్మిణి 17వ ర్యాంకును సాధించారు. ఓబీసీ (ఎన్‌సీఎల్) క్యాటగిరిలో మంగారి వరుణ్ ఆలిండియా 10వ ర్యాంకు, ఎస్సీ క్యాటగిరిలో రెడ్డిమల్ల శ్రీశాంత్ మూడో ర్యాంకు, ఎస్టీ క్యాటగిరిలో పూజారి హాసిని 3వ ర్యాంకును సొంతం చేసుకున్నారు.

దెబ్బతీసిన ఫిజిక్స్

నీట్-యూజీ ప్రశ్నలు ఈ సారి కఠినంగా ఉన్నాయి. ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు విద్యార్థులను దెబ్బతీశాయి. దీంతో టాపర్లు కూడా 100 పర్సంటైల్ మార్కులను కైవసం చేసుకోలేకపోయారు. ఫిజిక్స్‌లో 45 ప్రశ్నలివ్వగా, చాలా మంది విద్యార్థులు 25-30 ప్రశ్నలతోనే అగిపోయారు. మిగతా ప్రశ్నలకు ఆన్సర్లు చేయలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. గతంలో చాలాసార్లు ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగానే ఉన్నాయి. కెమిస్ట్రీ ప్రశ్నలే కఠినంగా ఇచ్చిన సందర్భాలు ఎక్కువ. కానీ ఈ సారి అంచనాలు పూర్తిగా తలకిందులయ్యాయి. ఫిజిక్స్ ప్రశ్నలు అత్యంత కఠినంగా ఇవ్వడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు.

తెలంగాణ నుంచి క్వాలిఫై అయిన వారు

	2024	2025
రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు	79,813	72,094
హాజరైనవారు	77,848	70,259
క్వాలిఫై అయిన వారు	47,356	41,584

పాటలు వింటూ ఒత్తిడిని దూరం చేసుకున్నా

నీట్‌లో ప్రశ్నలు పొడవుగా కఠినంగా వచ్చాయి. ఆన్సర్లు రాసేందుకు చాలా సమయం పట్టింది. మొదట్లో మంచి ర్యాంకు వస్తుందన్న ఆశించలేదు. కానీ ఆలిండియా 37వ ర్యాంకు రావడం సంతోషానిచ్చింది. ఎయిమ్స్ ఢిల్లీలో చేరుతా. నా సోదరుడు మెడికోగా ఉన్నారు. నీట్ కోసం ఉదయం 8: 30 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు చదివేవాడిని. ఆటలాడేందుకు గంట విరామం తీసుకునేవాడిని. టేబుల్ టెన్నిస్, క్రికెట్ ఆడేవాడిని. యూట్యూబ్‌లో పాటలు వింటూ ఒత్తిడిని దూరంచేసుకున్నా.

-షణ్ముఖ నిశాంత్ అక్షింతల

అమ్మమ్మ చనిపోయినప్పుడే డాక్టర్ కావాలనుకున్నా

నా చిన్నతనంలోనే అమ్మమ్మ క్యాన్సర్‌తో చనిపోయారు. అమ్మమ్మను బతికించుకోలేకపోయామన్న క్షోభ నన్ను వెంటాడింది. మా ఇంట్లో డాక్టర్లు లేరు. అప్పుడే డాక్టర్ కావాలని బలమైన నిర్ణయం తీసుకున్నా. ఇంటర్ హైదరాబాద్‌లో చదివా. నీట్‌లో 670 మార్కులొచ్చాయి. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు చెస్ ఆడేవాడిని. ఎయిమ్స్‌లోనే ఎంబీబీఎస్ కోర్సులో చేరుతా.

-జీవన్ సాయికుమార్

మెడిసిన్ చేయాలని చిన్నప్పుడే అనుకున్నా

మెడిసిన్ చేయాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నా. నీట్ కోసం చాలా కష్టపడ్డా. మంచి ర్యాంకు రావడం సంతోషానిచ్చింది. కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరుతా.

-షణ్ముఖ్

విజయ సంకేతాన్ని చూపిస్తున్న నారాయణ యాజమాన్యం, విద్యార్థులు

నీట్ ఫలితాల్లో నారాయణ విజయ పరంపర

- ఓపెన్ క్యాటగిరీలో ఫస్ట్ ర్యాంకు
- అన్ని క్యాటగిరీల్లో 10 లోపు 8 ర్యాంకులు కైవసం

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2025 ఫలితాల్లో ఆలిండియా అన్ని క్యాటగిరీల్లో నారాయణ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. తెలుగు రాష్ట్రాల్లో ఓపెన్ క్యాటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించడంపై నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పీ సింధూరనారాయణ, పీ శరణినారాయణ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో మృణాల్ కిషోర్ ఝా 4వ ర్యాంకు, కేశవ్ మిట్టల్ 7వ ర్యాంకు, సౌమ్య శర్మ 14వ ర్యాంకు, కే జీవన్ సాయి కుమార్ 18వ ర్యాంకు, రూపయన్ పాల్ 20వ ర్యాంకులతో సంచలన విజయాలు అందుకున్నట్టు తెలిపారు. వీటితోపాటు 35,47,49, 59, 66, 70, 71,73,75,77,80,87,93,94,95 వంటి 100లోపు 22 ర్యాంకులు, 1000 లోపు 85 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఆలిండియా అన్ని క్యాటగిరీల్లో 1,2,3,3,4,4,7,10 వంటి 10 లోపు 8 ర్యాంకులు, 100 లోపు 65 ర్యాంకులు, 1000 లోపు 216 ర్యాంకులు సాధించి సరికొత్త రికార్డు సృష్టించినట్టు తెలిపారు. విశిష్టమైన ప్రణాళికలతో రూపొందించిన స్టార్ నీవో బ్యాచ్, ఎన్ -40 ప్రోగ్రామ్‌ల ద్వారా మాత్రమే టాప్ ర్యాంకుల సాధన నిరంతరాయంగా కొనసాగుతున్నదని వెల్లడించారు.

నీట్-యూజీ ఫలితాల విడుదల

- తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు టాప్-100లో దక్కిన ర్యాంకులు
- రాజస్థాన్ కుర్రాడికి మొదటి ర్యాంక్

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుర్వేద, ఇతర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా మేలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-యూజీ) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఫైనల్ కీని విడుదల చేసిన కొద్ది గంటలకే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ ఫలితాలను వెబ్ సైట్ https://neet.nta.nic.in/ లో ఉంచింది. ఫలితాల్లో టాప్-10 ర్యాంకుల్లో తెలుగు విద్యార్థులకు చోటు దక్కలేదు. అయితే టాప్-100లో తెలంగాణ విద్యార్థులు పలు ర్యాంకులు సాధించారు. జీవన్ సాయికుమార్ 18, షణ్ముఖ నిషికాంత్ అక్షింతల 37, ఎం.వరుణ్ 46, వై షణ్ముఖ్ 48, విదిశా మాజీ 95వ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. అలాగే ఏపీకి చెందిన కార్తీక్ రామ్ కిరీటి 19, కొడవటి మోహిత్ శ్రీరామ్ 56, దేశిన సూర్య చరణ్ 59, పి అవినాశ్ 64, వై సమీర్ కుమార్ 70, టి శివమణి 92వ ర్యాంక్ సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో 33 ప్రభుత్వ మెడికల్, రెండు డీమ్డ్, 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీలుండగా, వీటిలో 8,515 సీట్ల వరకు ఉన్నాయి. నీట్-యూజీలో రాజస్థాన్‌కు చెందిన మహేశ్ కుమార్ మొదటి ర్యాంక్ సాధించగా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ అవాదియా రెండో ర్యాంక్ పొందినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. 22.09 లక్షల మంది పరీక్షకు హాజరు కాగా, అందులో 12.36 మంది అర్హత సాధించారు. ఇది నిరుడు 13.15 లక్షల కన్నా ఇది తక్కువ. అర్హత సాధించిన వారిలో మహిళలు 7.2 లక్షల మంది ఉండగా, పురుషులు 5.14 లక్షల మంది ఉన్నారు. .

కాగా, దేశంలోని 1,08,000 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ప్రతి ఏడాది ఎన్‌టీఏ నీట్-యూజీని నిర్వహిస్తున్నది. ఇందులో 56 వేల సీట్లు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో, 52 వేలు ప్రైవేట్ కాలేజీల్లో ఉన్నాయి. నీట్ ద్వారా దంత, ఆయుర్వేద, యునాని, సిద్ధ వంటి ఇతర వైద్య కోర్సుల్లో కూడా ప్రవేశాలను నిర్వహిస్తారు.

నీట్ యూజీ స్కోర్ తారుమారుకు 90 లక్షలు డిమాండ్

నీట్-యూజీ 2025 పరీక్ష స్కోర్ కార్డును..మార్చేస్తామంటూ అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల్ని మోసం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సీబీఐ పట్టుకుంది. పరీక్ష స్కోర్ కార్డును తారుమారు చేసేందుకు రూ.90 లక్షలను డిమాండ్ చేసిన సోలాపూర్, ముంబయిలకు చెందిన సందీప్ షా, సలీమ్ పటేల్‌లను సీబీఐ ఇటీవల అరెస్టు చేసింది. తక్కువ మార్కులు ఉన్న అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను ఆకర్షించి..సీటు లభించే విధంగా చేస్తామంటూ తప్పుడు హామీలతో వల పన్ను తున్నారని, విద్యార్థులను మోసం చేయడానికి నిందితులు అనుసరించిన విస్తృత పన్నాగాన్ని తమ దర్యాప్తులో బయటపెట్టామని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి. ప్రతి ఒక్క అభ్యర్థి నుంచి రూ.90 లక్షల్ని నిందితులు డిమాండ్ చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో ఎన్‌టీఏ అధికారుల ప్రమేయం ఉన్నట్టుగా ఆధారాలు లభ్యం కాలేదని సీబీఐ పేర్కొన్నది.



కరీంనగర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి

నీట్ ఫలితాల్లో అల్ఫోర్స్ అత్యుత్తమ ప్రతిభ

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 14 : నీట్-2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన విద్యార్థులు వీ శశాంక్‌రెడ్డి 599 మార్కులు సాధించగా, బీ వర్షిత్ 556, ఆదిబా ఫిర్దోజ్ 553, జే మైథిలి 535, ఎండీ అఫ్నాన్ 513, బీ భువనకృతి 508, ఏ సాత్విక 507, జే అనూష 500 మార్కులు సాధించినట్టు చెప్పారు. నీట్ కోచింగ్‌లో డాక్టర్స్-30 ప్రత్యేక కార్యక్రమం ద్వారా కోచింగ్ అందించిన మూడో సంవత్సరంలో అల్ఫోర్స్ విజయ పరంపర కొనసాగుతుందని వెల్లడించారు. ఎనిమిది మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషమని పేర్కొన్నారు. 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్ఠాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించగలరని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపకులు, అధ్యాపకేతర బృందానికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

విజయోత్సవ మీట్‌లో డైరెక్టర్ సుష్మ, విద్యార్థులు

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య ఆధిపత్యం

- ఆలిండియా స్థాయిలో చైతన్యకు ఫస్ట్ ర్యాంకు
- టాప్ 10లోపు ర్యాంకుల్లో 5 ర్యాంకులు కైవసం

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2025 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించి శ్రీ చైతన్య తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నది. శనివారం విడుదల చేసిన నీట్-2025 ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో టాప్ ర్యాంకులతోపాటు మొత్తం ర్యాంకుల్లో అగ్రస్థానంలో నిలిచినట్టు శ్రీచైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. శ్రీ చైతన్య విద్యార్థులు కవిష్ ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, దివ్య 5వ ర్యాంకు, మహ్మద్ సమీర్ 6వ ర్యాంకు, బీ ధీరజ్ కుమార్ 8వ ర్యాంకు, మంగరి వరుణ్ 10వ ర్యాంకు సాధించి సత్తా చాటినట్టు పేర్కొన్నారు. అలాగే ఆలిండియా టాప్ 10 లోపు ర్యాంకుల్లో 5 ర్యాంకులు వచ్చినట్టు తెలిపారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీల్లో 100లోపు అత్యధిక ర్యాంకులు శ్రీ చైతన్య విద్యార్థులే సాధించడంపై హర్షం వ్యక్తంచేశారు. నీట్-2026కు ఏఐ టెక్నాలజీతో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, సిబ్బందిని అభినందించారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేత

చిక్కడపల్లి, జూన్ 14: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వడ్డెర సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జెరిపేటి సత్యనారాయణ రాజు, ఎత్తరి అంతయ్య, డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, వల్లపు లక్ష్మీనారాయణ, దండవుల రాములు ,పల్లపు సత్యనారాయణ, పల్లపు గణేశ్, తన్నీరు వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

రాహుల్‌కు డబ్బులు పంపడంలో పోటీ

బీజేపీ నేత, మాజీ ఎంపీ బూరనర్సయ్య గౌడ్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాహుల్‌గాంధీకి డబ్బులు పంపడంలో కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 18నెలలు గడిచినా.. ఎన్నికల హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రజల చెవిలో పువ్వులు పెడుతూనే ఉన్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 12763 సర్పంచులు, 5717 మంది ఎంపీటీసీలు, 538 జడ్పీటీసీలు ఉన్నారని, వారి పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానికసంస్థల ఎన్నికల ఆలస్యంతో పల్లెలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా స్థానిక సంస్థలకు వచ్చే రూ.1514 కోట్ల నిధులను రాష్ట్ర ప్రజలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వం స్థానికసంస్థలకు ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్‌చేశారు. స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ధైర్యం ఉంటే కులగణన సర్వే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

విప్లవకారులకు చేగువేరా మార్గదర్శకం

సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ప్రపంచ విప్లవకారులకు చేగువేరా మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చేగువేరా 87వ జయంతి సందర్భంగా శనివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లో చేగువేరా చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం చేసిన గొప్ప విప్లవకారుడు చేగువేరా అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాల్లో ముఖ్యంగా అమెరికాలోని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా దేశంలో ఫెడరల్ క్యాస్ట్రో నాయకత్వంలో విప్లవం సాగించారని ఆయన గుర్తుచేశారు. లాటిన్ అమెరికా దేశాల్లో జరుగుతున్న సామ్రాజ్యవాదంపై పోరాటం నిర్వహించారని, ప్రపంచ విప్లవకారులు, కమ్యూనిస్టులు చేగువేరా పోరాటాన్ని మరువలేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి ఏ గోవిందరావు, బిల్డింగ్ ఇన్‌చార్జి బోయ శ్రీరాములు, ఓయూ విద్యార్థి నాయకులు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మంత్రులకు చాంబర్లు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గంలో కొత్తగా చేరిన ముగ్గురు మంత్రులకు సచివాలయంలో చాంబర్లు కేటాయించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)శనివారం ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మొదటి అంతస్థులోని 13, 14, 15, 16 నంబర్ గదులను కేటాయించారు. వివేక్ వెంకటస్వామికి సెకండ్ ఫ్లోర్‌లో 20, 21, 22 నంబర్ గదులు, వాకిటి శ్రీహరికి అదే అంతస్థులో 26, 27, 28 నంబర్ గదులు కేటాయించారు. కాగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖలు కేటాయించగా. వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ శాఖలు, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు కేటాయించిన సంగతి తెలిసిందే.

మహబూబాబాద్ మండలం దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్‌ను నిలదీస్తున్న మహిళలు

రైతుభరోసా ఏమైంది సారూ?

డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను నిలదీసిన మహిళలు

దంతాలపల్లి, జూన్ 14: 'కారుల్లో వస్తున్నారు. పోతున్నారు బాగానే ఉంది.. కానీ రూ.500కే గ్యాస్ ఇస్తామన్నారు. ఇప్పటివరకు ఇయ్యలేదు. రూ.1100 పెట్టి గ్యాస్ కొంటున్నం.., కానీ, మా బ్యాంక్ ఖాతాలో రూ.47 మాత్రమే పడుతున్నాయి. ఎందుకు సారు'.. అని కారు ఎక్కి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను మహిళలు అడిగారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి శనివారం వచ్చిన ఆయన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపత్రాలు ఇచ్చే క్రమంలో మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. రైతు భరోసా, బోనస్ ఎందుకు ఇస్తలేరు సారూ.. అని ప్రశ్నించారు. గతంలో పెద్దముప్పారంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది.. వాటి సంగతి ఏంది సార్.. అని అడుగగా సీఎంను అడగండి అని సమాధానం చెప్పారు. సమస్యలపై మీరే కదా సీఎంను అడుతారని మహిళలు ఆయన్ని ప్రశ్నించారు.

మరోసారి సిట్ విచారణకు ప్రభాకర్‌రావు

17నవిచారణకు పిలిచిన సిట్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. ఆయనను శనివారం ఉదయం నుంచి రాత్రి 8.40 వరకు విచారించారు. ఈ కేసులో ఇప్పటికి మూడుసార్లు ప్రభాకర్‌రావును సిట్ విచారించింది. శనివారం నాటి విచారణకు ప్రభాకర్‌రావు సహకరించలేదని తెలిసింది. పదేపదే అడిగిన ప్రశ్నలే అడగటంతో.. ఆయన కూడా గత విచారణలో చెప్పిన సమాధానాలే చెప్పినట్టు సమాచారం. ఈ కేసులో ఇకపై బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నట్టు సిట్ అధికారులు తెలిపారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్ట్‌లను పిలిచి వారి వాంగ్మూలం తీసుకోనున్నట్టు తెలిసింది. త్వరలో ప్రభాకర్‌రావు ఫోన్‌లను సీజ్ చేయనున్నట్టు సమాచారం. కాగా, ఈ నెల 17న ప్రభాకర్‌రావును మరోసారి విచారణకు హాజరు కావాల్సిందిగా సిట్ అధికారులు ఆదేశించారు.

102మందికి ఐఐటీల్లో అడ్మిషన్లు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన 102మంది విద్యార్థులు దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించారు. సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి శనివారం ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ శనివారం మొదటి రౌండ్ సీట్ల భర్తీ నిర్వహించగా 102 మంది గురుకుల విద్యార్థులు పలు ఇన్‌స్టిట్యూట్లలో సీట్లు పొందారు.

పల్లెబాటలో పీసీసీ నేతకు నిరసన సెగ

పెద్దవంగర, జూన్ 14 : పల్లెబాటలో టీపీసీసీ రాష్ట్ర నేతకు నిరసన సెగ తగిలింది. సంక్షేమ పథకాలు ఏమయ్యాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిని గిరిజనులు నిలదీశారు. శనివారం ఆమె మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం మోత్యాతండా, శంకర్‌తండా, బొత్తల తండాల్లో నిర్వహించిన పల్లెబాటలో పాల్గొన్నారు. ఆయా తండాల ప్రజలు తమ సమస్యలను వినిపించే ప్రయత్నం చేయగా, ఆమె అర్ధంతరంగా పర్యటనను ముగించుకొని వెళ్లిపోయారు. పల్లెబాటలో భాగంగా మోత్యతండా గిరిజనులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీశారు. తాగునీటి కొరత, విద్యుత్తు సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై నిలదీయగా స్పందించకుండా వెళ్లడంతో గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇలా ప్రజల సమస్యలు పట్టించుకోకుండా వెళ్లిపోతే నాయకుల అవసరం ఏమిటి?' అంటూ ఆసహనం వ్యక్తంచేశారు.



మహబూబాబాద్ జిల్లా మోత్యా తండాలో ఝాన్సీరెడ్డిని నిలదీస్తున్న గిరిజనులు

'ఎర్రబెల్లి'కి జైకొట్టిన కాంగ్రెస్ నేత

బొత్తల తండాలో నిర్వహించిన పల్లెబాటలో ఓ కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ.. జై కాంగ్రెస్.. జై కాంగ్రెస్ అంటూనే ఒక్కసారిగా జై దయాకర్‌రావు అని నినదించాడు. దీంతో అక్కడున్న కాంగ్రెస్ నాయకులు, గిరిజనులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

వీధి వ్యాపారులపైకి బుల్డోజర్

పాలమూరులో నిరసన

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 14 : పాలమూరులో వీధి వ్యాపారులపైకి బుల్డోజర్ వెళ్లడంతో పండ్ల వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కమర్షియల్ దుకాణాలు నిర్మించారు. ఇక్కడే కొన్నేళ్లుగా కొందరు పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. షటర్ల నిర్మాణం చివరి దశకు చేరడంతో శనివారం ఆర్టీసీ అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, పోలీసులు పండ్ల బండ్లు తొలగించేందుకు జేసీబీతో వచ్చారు. దీంతో పండ్ల వ్యాపారులు బుల్డోజర్‌ను అడ్డుకొని అక్కడే బైఠాయించి నిరసనకు దిగారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని మున్సిపల్ అధికారులను, పోలీసులను వారించారు. దీంతో అధికారులు వెనుకడుగు వేశారు. ఆర్టీసీ కమర్షియల్ షెటర్ల కోసం రూ.3 లక్షల డిపాజిట్‌తో టెండర్లు వేశామని ఆర్టీసీ ఆర్‌ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. ఇక్కడ పండ్ల బండ్లు ఉంచితే దుకాణాలు దక్కించుకున్న వారు వ్యాపారాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు.



మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జేసీబీని అడ్డుకుంటున్న చిరువ్యాపారులు

సీఎం మాటేమైంది.. ఎమ్మెల్యే ఎక్కడ..?

బతుకుదెరువు కోసం వ్యాపారం చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు మా పొట్ట కొట్టేందుకు చూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు పర్యటనకు వచ్చిన సమయంలో ఫుట్‌పాత్‌పై బతికేటోళ్ల జోలికి వెళ్లొద్దని అధికారులను ఆదేశించారు. కానీ ఇప్